గోకులం షెడ్లకు గిరాకీ

- శింగనమల నియోజకవర్గానికి 300 యూనిట్ల మంజూరు
- యూనిట్ల సంఖ్య పెంచాలని పాడి రైతుల డిమాండ్

గార్లదిన్నె: గోకులం పథకం కింద నిర్మించే షెడ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా మినీ గోకులం కింద సబ్సిడీపై షెడ్లను నిర్మించుకోవడానికి పశుసంవర్ధక శాఖ పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. గోకులం షెడ్ల నిర్మాణంలో గొర్రెలు మేకలకు సంబంధించి 70 శాతం, కోళ్లకు 70 శాతం, పాడి రైతులకు 90 శాతం రాయితీ దక్కనుంది. ఉపాధి హామీ ద్వారా బిల్లులు చెల్లించనున్నారు. ప్రస్తుతం మంజూరైన యూనిట్లు ఏ మాత్రం సరిపోవని, వాటి సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

రాయితీ ఇలా...

యూనిట్ ఖరీదులో రైతు వాటా చెల్లించాల్సి ఉంటుంది. వాటిలో రెండు పశువులు ఉన్న యూనిట్ షెడ్‌కు రూ.1.15,000 కాగా రైతు వాటా రూ.11,500 వేలు చెల్లించాల్సి ఉంది. నాలుగు పశువులు ఉన్న షెడ్‌కు యూనిట్ ఖరీదు రూ.1,85 ,000 కాగా రైతు వాటాగా రూ.18,500 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు పశువులు కంటే ఎక్కువ ఉంటే యూనిట్ ఖరీదు రూ.2,30,000 కాగా అందులో రైతు వాటా రూ.23 వేలు చెల్లించాలి. అలాగే 20 గొర్రెలు, మేకలు యూనిట్ ఖరీదు రూ.1,30,000 కాగా అందులో రైతు వాటా రూ.39 వేలు, 50 గొర్రెలు దాటితే యూనిట్ ఖరీదు రూ.2,30,000 కాగా అందులో రూ.69 వేలు రైతు వాటా చెల్లించాలి. ఇక 100 కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.87 వేలు కాగా రైతు వాటా రూ.26,100, అలాగే 200 కోళ్లు అయితే యూనిట్ ఖరీదు రూ.1,32,000 కాగా అందులో రూ. 39,600 వేలు రైతుల వాటా చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

శింగనమల నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులాల వివరాలు

మండలం	మినీగోకులాలు
గార్లదిన్నె	50
శింగనమల	50
బుక్కరాయసముద్రం	50
నార్పల	50
పుట్లూరు	50
యల్లనూరు	50



లబ్ధిదారుల ఎంపిక ఇలా..

గోకులాల షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఎంపికకు నిబంధనలు ఉన్నాయి. దరఖాస్తు దారుడికి తన పేరుతో స్థలం ఉండాలి. గ్రామసభ ద్వారా గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఉండాలి. దరఖాస్తుకు బ్యాంకు ,ఆధార్, పాన్ కార్డు జతపరచాలి. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ పేద మహిళలు యాజమానులుగా ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. లబ్ధిదారులు చిన్న, సన్న కారు రైతులై ఉండాలి. ఉపాధి హామీ పథకం ద్వారా పొందిన జాబ్ కార్డు తప్పని సరిగా ఉండాలి.

50 యూనిట్లు మంజూరు

మండలంలో 50 యూనిట్లు వరకు మినీ గోకులం షెడ్లు నిర్మాణానికి ఉన్నాతాధికారులు అనుమతించారు. మండలంలో ఇప్పటి వరకు 56 మంది పాడి రైతులు మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గోకులం యూనిట్లు పెంచాలని, అర్హులైన రైతులందరికీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

– గార్లదిన్నె పశుసంవర్ధక శాఖ డాక్టర్ రమేష్

యూనిట్ల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ గోకులం పథకం కింద షెడ్లు నిర్మించి ఇవ్వాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయం ఉండకూడదు. దరఖాస్తు చేసిన ప్రతి లబ్ధిదారుడికి అర్హత ప్రకారమే మినీ గోకులాలు ఇవ్వాలి. మండలానికి 50 యూనిట్లు కేటాయించారు. వాటి సంఖ్య పెంచాలి.

– రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈమేరకు కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డి–షైన్ ప్రొ సొల్యూషన్స్, కార్పొన్ గ్లోబల్ సొల్యూషన్స్, టెక్–మహీంద్ర కంపెనీల్లో బీపీఓ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలియజేశారు. వివరాలకు లోకేష్–8096763970,మహేష్–8317520929 నంబర్లలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వీరాంజినేయులు

శింగనమల: మండలంలోని నాగులగుడ్డం తండాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మూడ్ నాగమ్మ (50) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజినేయులు నాగులగుడ్డం తండాకు వెళ్లి నాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనో ధైర్యం కల్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టడీ అవర్స్



స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం నుంచి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, హాస్టల్ వార్డెన్‌లు గమనించాలని కోరారు.

'సూపర్ సిక్స్'తో ఐదు కోట్ల ప్రజలకు లబ్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని ఐదుకోట్ల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బుధవారం నాగసముద్రం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టాడన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలతో పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. రాగుల పాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరిచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

శింగనమల: గురుగుంట్ల గ్రామంలో బుధవారం అనారోగ్యంతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరారెడ్డి(82) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

11 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో 11 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ అబ్దుల్ రహీం ఆధ్వక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ శివ రామక్రిష్ణ పలు అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. మునిసిపాలిటీ అభివృద్ధి కోసం చేపట్టనున్న అంశాలను వివరించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఐ కౌన్సిలర్లు హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసమర్థతతో నెలకొన్న ప్రజా సమస్యలపై నిరంతరంగా ఉద్యమాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి కాలయంలో శింగనమల నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందన్నారు. ధరలు పెరిగి పోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇది మంచి పాలన పేరుతో స్టిక్కర్లు అంటించడంపై చూపే శ్రద్ధ ప్రజా సమస్యలపై చూపడం లేదన్నారు. ఎన్నికల హామీలను ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ అయిందని దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారన్నారు. కల్తీ లడ్డూ తిని ఎంతమంది మరణించారో, ఎంత మంది రోగాల బారిన పడ్డారో తేల్చాలన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల కల్తీ విత్తనాలు, ఎరువులతో పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వాటిపై ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోవడం లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం మతాల మధ్య చిచ్చు పెట్టేలా కుట్రలు చేస్తున్నారన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, నేతలు రామాంజినేయులు, రామక్రిష్ణ, రాము, గంగాధర్, తిరుపతయ్య, అరుణమ్మ, ఆనంద్‌కుమార్, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుత్తి: అనంతపురంలో అక్టోబర్ 5 నుంచి 8 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ కోరారు. గుత్తిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఆవరణలో బుధవారం ఆయన విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి రాష్ట్రస్థాయి సమావేశాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యా రంగ సమస్యలపై చర్చిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాలు, ధన, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు



వేరుశనగలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

గుంతకల్లు రూరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల అగ్రిలకల్చర్ ఆఫీసర్ స్వాతి రైతులకు సూచించారు. బుధవారం నాగసముద్రం , అయ్యవారుపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగసముద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరుకాగా, అయ్యవారుపల్లిలో వ్యవసాయ శాఖ సిబ్బంది వ్యవసాయంలో అదునిక పద్ధతులను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా డ్రోన్‌ల ద్వారా పంటలకు మందులు ఎలా పిచికారీ చేసుకోవాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు.

లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దవడుగూరు : పత్తి పంటలో పురుగుల ఉధృతిని నివారించడానికి లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ రజిని పేర్కొన్నారు. బుధవారం గుత్తిఅనంతపురం, విరుపాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. వేరుశనగ, పత్తి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు వస్తున్నందున పత్తి పంటలో గులాబీరంగు పురుగు ఉధృతి పెరుగుతుందని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కంది పంటకు తెగులు సోకకుండా ఉండటానికి ప్రొపట్రెట్ 400 మి.లీ ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే సబ్సిడీ వివరాలను తెలయజేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

శింగనమల: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆధిక దిగుబడులు సాధించివచ్చునని ఏఓ అన్వేష్‌కుమార్ అన్నారు. బుధవారం రాచేపల్లి, ఆనందరావుపేట పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేరుశనగలో ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండెజిమ్ మరియు మాంకోజెబ్(సాఫ్) 100 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వరిలో సుడి దోమ నివారణకు 300 గ్రాములు ఒక ఎకరానికీ పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ అక్కమ్మ, ఎంపీఈఓ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ సిబ్బంది మహేష్, రైతులు పాల్గొన్నారు.

పామిడి: వంకరాజుకాలువ, నెమళ్లపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లోని వరి, వేరుశెనగ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ ఆయా పంట సాగులో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ శ్రీనివాసరావ్, వీహెచ్ఏ శ్రీకాంత్, వెటర్నరీ అసిస్టెంట్ అబ్దుల్‌వలి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: పంటల సాగులో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలనిలేపీ శ్యాం సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త కవిత, హెచ్ఓ శైలజా, సర్పంచ్‌లు సుధాకర్ రెడ్డి, మల్లికార్జున, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఓబులరెడ్డి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: రైతులు పంటల సాగుకు ముందు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మొహరున్నీసా బేగం సూచించారు. మండలంలోని తొండపాడు, ఎంగిలిబండ గ్రామాల్లో బుధవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వేరుశనగ, కంది పొలాలను ఏఓ పరిశీలించారు. అనంతరం మట్టి పరీక్షల ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. ఏఈఓ కృష్ణభగవాన్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 కోట్ల స్థలం కబ్జా



డాక్యుమెంట్లు చూపిస్తున్న గంగాధర్

గుత్తి: సుమారు రూ.10 కోట్ల విలువైన తన స్థలాన్ని నలుగురు వ్యక్తులు కబ్జా చేశారని, ఈ విషయంలో న్యాయం చేయాలని గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి గంగాధర్ వేడుకున్నాడు. గుత్తి ఆర్ఎస్‌లోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన తాత గోవిందరాజులు నుంచి సంక్రమించిన సర్వే నంబర్ 210లో ఉన్న ఐదెకరాల్లో రెండెకరాల దాకా ఆక్రమించేశారన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో పాటు జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు, తహసీల్దార్లు, స్థానిక పోలీసులు, రాజకీయ నాయకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పైగా కబ్జాదారులు తనపైనే కేసులు పెట్టడంతోపాటు దాడులు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని లేకపోతే తాను తీసుకునే నిర్ణయాలకు అందరూ బాధ్యులు కావలివస్తుందని హెచ్చరించారు.

జిల్లా స్థాయి పోటీలకు శింగనమల విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన శింగనమల విద్యార్థులు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నందకుమార్ తెలిపారు. షాట్‌పుట్‌లో పి.పెద్దారెడ్డి మొదటి స్థానం, లాంగ్ జంప్, హైజంప్‌లో రెండో స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో గోవర్ధన్‌రెడ్డి, లాంగ్ జంప్‌లో రెండవ స్థానం, చెస్‌లో కూల్ విన్నర్‌గా నాగరాజు ఎంపికయ్యారన్నారు. సలకంచెరువు జిల్లా పరిషత్‌కు చెందిన సీ.పూజిత బ్యాడ్మింటన్, పి.వేదశ్రీ పరుగు పందెంలో మొదటి స్థానం, హైజంప్‌లో మూడవ స్థానం సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బుక్కరాయసముద్రం: కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్‌నారాయణ, స్కూల్ కమిటీ చేర్మెన్ నాగేంద్ర, పీడీ నిరంజన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: కల్లూరు జెడ్పీ హైస్కూల్లో బుధవారం అండర్–14, 17 బాలురు, బాలికలకు పాఠశాల హెచ్ఎం శారాదబాయి ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీ ల్లో జిల్లాలో అన్ని మండలాల నుంచి 150 బాల,బాలికలు పాల్గొన్నారు. అందులో 50 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ నాగరాజు, జిల్లా కోచ్ రాఘవేంద్ర, పీడీలు రాంప్రసాద్, ఆదినా రాయణ రెడ్డి, ఉపాధ్యాయులు కులశేఖర్ రెడ్డి, పీఈటీలు మల్లికార్జున, నరసంహులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అనంతపురం జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గార్లదిన్నె ముస్లిం , మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు మొత్తం 17 స్థానాల్లో గెలుపొందారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: కొప్పలకొండ పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. కొప్పలకొండకు చెందిన ముగ్గురు వ్యక్తులు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేశారు. కమలాపురం వద్ద మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దవడుగూరు : గుత్తిఅనంతపురం సమీపంలోని వంక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ను బుధవారం సీజ్ చేసినట్లు యస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

'రైతు ఆత్మహత్యకు రెవెన్యూ అధికారులే కారణం '

గార్లదిన్నె: రైతు సూర్యనారాయణ ఆత్మహత్యకు రెవెన్యూ అధికారులే కారణమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఆరోపించారు. ఈమేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సూర్యనారాయణ ఆత్మహత్య ఘటనపై ఆందోళన చేశారు. భూ సమస్య పరిష్కరించి ఉంటే సూర్యనారాయణ బతికేవారన్నారు. ఇప్పటికైనా భూమిని ఆయన భార్యపై ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకు రాలు ఉమామహేశ్వరి, రైతు సంఘం నేతలు అక్బర్, రామాంజనేయులు, నాగరాజు, ఓబిలేసు, పుల్లన్న పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సత్కారం

పామిడి: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రామగిరి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జీ రఫీ ఉద్దీన్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో సర్పంచ్ వడ్డే లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆయనకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం పాఠశాలలో 20 ఏళ్లపాటు వంట ఏజెన్సీ నిర్వహించిన తిరుపతమ్మ, నాగమ్మ, నాగేశ్వరమ్మను సన్మానించారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు,రవి, షర్మాస్‌బాషా, సులోచన, పుష్పవేణి, శాంతయ్య, సన్యాసప్పడు, భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు వడ్డే ఎర్రిస్వామి, వడ్డే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ ఆకస్మిక మృతి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సూరి బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. సూరి మృతి పట్ల అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు



బేకరీలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని, పట్టణంలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు. గుత్తిలోని పలు దుకాణాలు, హోటళ్లు, బేకరీలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న షాపు నిర్వాహకులపై జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ వనజ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ అడుగుజాడల్లో నడుద్దాం



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుంతకల్లుటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో నడుద్దామని బీజేపీ అసెంబ్లీ, పట్టణ కన్వీనర్లు కృష్ణమూర్తి, వడ్డేర మేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇల్లూరు భవన్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వమానవాళిని దృష్టిలో పెట్టుకుని దయాళ్ చెప్పిన సిద్ధాంతం ఏకాత్మతా మానవతావాదమని వారు కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని వారు చెప్పారు. బీజేపీ నాయకులు సూర్యనారాయణ, విజయలక్ష్మి, రాఘవ, మునిరాజు పాల్గొన్నారు.

పాతకొత్తచెరువు హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి



పాఠశాలలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మంజులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ బుధవారం పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేపట్టారు. పాఠశాల నిర్వహణ ఏమాత్రం బాగోలేదని, విద్యార్థులకు తాగడానికి నీటి కుళాయిలు ఉన్నప్పటికీ వాటికి తాళాలు వేయడంతో తొట్టిలో ఉన్న నీటినే తాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్ల విద్యార్థులు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు ఉడికీ ఉడకని భోజనాన్ని వడ్డిస్తూ వారి ఆరోగ్యంతో చలగాటం అడుతున్నారన్నారు. పాఠశాలలో ఇంత జరుగుతున్నా ఏమాత్రం పట్టించుకొని హెచ్‌ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

మహిళపై దాడి

యల్లనూరు: గొడవ పడొద్దన్నందుకు ఇద్దరు వ్యక్తులు మహిళపై దాడి చేశారు. వివరాలు.. బుధవారం మండల కేంద్రంలో హైస్కూల్ వద్ద అశోక్, రాజు గొడవకు దిగారు. గొడవ ఎందుకు పడుతారు పెద్దమనుషులతో పంచాయతీ చేసుకోవాలంటూ చాపల పద్మావతి చెప్పింది. దీంతో ఇద్దరూ ఒక్కసారిగా ఆమెపై దాడి చేశారు. బాధతురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు.

ఘనంగా గంధం

పామిడి: పట్టణంలో బుధవారం రాత్రి సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసుకు సంబంధించి గంధం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ పురవీధుల్లో గంధం రేగించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

యల్లనూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. బుధవారం నీర్జాంపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722, 9010588846, 9010223701